కీసర బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాగలింగం, ఈఓ నరేందర్ తదితరులు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మార్చి 6వ తేదీ నుంచి 11 వరకు జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ప్రముఖులకు ఆహ్వానాలు అందుతున్నాయి. శుక్రవారం ఆలయ చైర్మన్ నాగలింగం ఆధ్వర్యంలో సభ్యులు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్‌ని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ నరేందర్, వంశపారంపర్య ధర్మకర్తలు తటాకం నారాయణ, వెంకటేశ్, ఉమాపతి, అఖిలాశ్, పండితులు బల్‌రాం శర్మ, బన్ని శర్మ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రహదారి పనులు ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. కౌన్సిలర్ల సూచన మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి 'గృహజ్యోతి'



జీరో బిల్లు విధానాన్ని పరిశీలిస్తున్న డీఈ భాస్కరరావు

కీసర: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామని నాగారం విద్యుత్ డీఈ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం నాగారం పరిధిలోని పలు కాలనీల్లో జీరో కరెంటు బిల్లు జారీ విధానాన్ని ఆయన ఏడీఈ కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ భాస్కరరావు మాట్లాడుతూ.. అర్హతతో పాటు తెల్లరేషన్‌కార్డు ఉన్నా జీరో బిల్లు రానివారు మున్సిపల్ కార్యాలయంలో పథకం కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్కడ ఇచ్చిన రశీదుని సంబంధిత కార్యాలయాల్లో అందిస్తే పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ కామేశ్, శ్రీనివాస్‌రావు, నరసింహ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లులు పంపిణీ

ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని పట్టణంలోని శివారెడ్డిగూడ ఎస్సీ కాలనీలో శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా డీఈ భాస్కర్‌రావు, ఏడీ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ఏఈ సతీశ్‌కుమార్‌తో కలిసి జీరో బిల్లులు పంపిణీ చేశారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కీసర: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శేఖర్, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ కె.బలరాం, ఓఎస్‌జీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత వీబీఐటీ జట్టు




ఘట్‌కేసర్: కండ్లకోయాలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన పురుషుల బాస్కెట్ బాల్ టోర్నీలో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన చివరి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలేజీ చైర్మన్ నర్సింహారెడ్డి హాజరై విజేత జట్టుకు షీల్డ్‌తో పాటు క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీబీఐటీ పీడీ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడోత్సవం

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఉత్కృష్ట పేరిట మూడు రోజుల పాటు సాగిన క్రీడోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పోటీల్లో 45 కళాశాలలకు చెందిన 90 జట్లు పాల్గొనగా విజేతలకు ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. స్పోర్ట్స్ మీట్ విజయవంతం చేసిన క్రీడాకారులు, విద్యార్థులు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్ రామదాసు, సాక్ కన్వీనర్ శైలజారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఇంజినీరింగ్ క్లబ్' ఆధ్వర్యంలో సదస్సు



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మెకానిక్ ఇంజినీరింగ్ విభాగంలో 'హీటింగ్ వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్'పై శుక్రవారం సదస్సు జరిగింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజినీరింగ్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ధనుష్ ఇంజినీరింగ్ సర్వీసెస్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ హాజరై హెచ్‌వీఏసీ ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, చలపతి, ప్రొఫెసర్లు అరుణ్‌రెడ్డి, నీరజ, సందీప్ కుమార్, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాక్ ఫెస్ట్ ప్రారంభం

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న హ్యాక్ ఫెస్ట్ శుక్రవారం సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హ్యాకథాన్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో వినూత్న ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు. కాగా 36 గంటల పాటు సాగనున్న హ్యాకథాన్ కార్యక్రమంలో 17 రాష్ట్రాలకు చెందిన 1200 టీమ్స్ రిజిస్టర్ చేసుకోగా వారిలో 85 టీమ్స్ ప్రదర్శనలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ సురేశ్, హెచ్‌ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరి గురి.. మల్కాజ్‌గిరి

- ఎంపీ స్థానంపై అభ్యర్థుల మధ్య బలమైన పోటీ
- పార్టీల టికెట్ కోసం సీనియర్లు, బడాబాబుల యత్నం
- గతంలో రాజకీయం చేయని నేతలు సైతం రేసులో..



మేడ్చల్: దేశంలో అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ దక్కించుకునేందుకు అన్ని పార్టీల నేతలు అమితాసక్తి చూపుతున్నారు. మేడ్చల్, కంటోన్మెంట్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలతో కలిపి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంగా ఉంది. సగం హైదరాబాద్ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. దీంతో 30 లక్షలకు పైగా ఓటర్లు గల ఈ నియోజకవర్గంపై అన్ని ప్రాంతాల నేతలు కన్నేశారు. రేపో.. మాపో టికెట్ల ఖరారు చేయనుండటంతో నాయకులు మధ్య పోటీతత్వం పెరిగింది.

అన్ని పార్టీల్లోనూ..

బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలలో మల్కాజ్‌గిరి టికెట్ కోసం పోటీ గట్టిగానే ఉంది. బీఆర్‌ఎస్ నుంచి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంబీపూర్ రాజు రేసులో ఉండగా.. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ప్రముఖ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, మధుయాష్కి గౌడ్ తదితరులు రేసులో కనిపిస్తున్నారు. మరోవైపు బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకుడు మురళీధర్‌రావు, మాజీ ఎంపీ సురేశ్‌రెడ్డి, విద్యావేత్త మల్క కొమురయ్య, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ తదితరులు పోటీలు ఉన్నారు.

జోరుగా ప్రచారం..

మల్కాజ్‌గిరి టికెట్ ఆశిస్తున్న నేతల్లో చాలామంది నియోజకవర్గ రాజకీయాలకు పరిచయం లేని వ్యక్తులే అధికం. ఈక్రమంలో బీజేపీ టికెట్ ఆశిస్తున్న కొమురయ్య నగరం మొత్తం తన పోస్టర్లు, హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్‌లతో నింపేశారు. మరో నేత రామకృష్ణ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా.. మురళీధర్‌రావు ఒకవైపు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మరోవైపు హోర్డింగ్‌లు, పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లు జోరుగా ఏర్పాటు చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అల్లుఅర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి రహదారుల వెంబడి, పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో కనిపించని భద్రారెడ్డి పేరుతో కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పడ్డాయి. ఇలా టికెట్ ఆశిస్తున్న నేతలు ఎవరికి వారు జోరుగా ప్రచారం చేసుకోవడం విశేషం.

పట్టణ ఓటర్లు అధికం..

మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం విభిన్నమైంది. 95 శాతం పట్టణ ఓటర్లున్న ప్రాంతం ఇది. నియోజకవర్గంలో స్థానికుల కంటే సెటిలర్ ఓటర్లే అధికం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ఉత్తర భారతం నుంచి వచ్చిన వారే ఎక్కువ ఓటర్లుగా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం.. కేంద్రంలో మోదీ షరిష్మా పని చేస్తుండటంతో ఈ రెండు పార్టీలకు చెందిన రాజకీయ నిరుద్యోగులు టికెట్ రేసులోకి వచ్చారు. కాంగ్రెస్, బీజేపీ సింబల్‌పై పోటీ చేస్తే ఈజీగా విజయం సాధించవచ్చన్న ఆశతో ధనవంతులైన నేతలు రాజకీయ రంగంలోకి దిగుతున్నారు.

బీజేపీలో పోటీ ఎక్కువ..

మల్కాజ్‌గిరి బీజేపీ టికెట్ అందరి మధ్య పోటీ పెట్టింది. పార్టీ బీ ఫారం ఆశిస్తున్న ఈటల రాజేందర్, మురళీధర్‌రావు, కొమురయ్య మధ్య తీవ్ర పోటీ కనిపిస్తోంది. మురళీధర్‌రావు జాతీయ నేత కావడం.. ఈటల రాష్ట్ర కీలక నేత కావడంతో వారు నేరుగా ఢిల్లీ పెద్దలతో టికెట్ రాజకీయం నడిపిస్తున్నారు. కొమురయ్య ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు ఉన్న వ్యక్తి కావడంతో ఆయన రూటు మరోలా ఉంది. ముగ్గురు నేతలు నియోజకవర్గంలో జోరుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విశేషం.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో ఎవరో..

మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ కోసమే అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరారనేది బహిరంగ రహస్యమే. ఆయన మేడ్చల్ జిల్లాకు పరిచయం లేని వ్యక్తి.. టికెట్ ఆశిస్తున్నానని చెప్పుకునే తన ప్రచారం మాత్రం జోరుగా సాగిస్తున్నారు. టికెట్ ఆశించే నాయకుల సంఖ్య పార్టీలో ఎక్కువగా ఉన్నా చంద్రశేఖర్‌రెడ్డి పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్ టికెట్ దాదాపుగా మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డికి కన్ఫామ్ అయిందని పార్టీ వర్గాల సమాచారం. మొత్తం మీద మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం అన్ని పార్టీలో నాయకుల మధ్య పోటీ పెంచింది.

నేడు తైబజార్ వేలం

కీసర: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో(తాత్కాలిక స్టాల్) తైబజార్ బహిరంగ వేలంపాటను నేడు(శనివారం) ఉదయం 11 గంటలకు కీసరగుట్ట కీసరవాణి వద్ద నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) వినూత్నరెడ్డి శుక్రవారం తెలిపారు. తైబజార్ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.51,000 నగదును కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలలోపు చెల్లించాలని తెలిపారు. వేలం దక్కించుకున్న వారు ఈ నెల 6వ తేదీ నుంచి 11 వరకు కీసరగుట్టలో ఏర్పాటు చేసే తాత్కాలిక స్టాల్స్ నుంచి (దుకాణదారుల) తైబజార్ వసూళ్లు చేసే వీలుందన్నారు.

కాప్రా జమ్మిగడ్డ ప్రాంతంలో భూ మాఫియా



జవహర్‌నగర్: సర్కారు భూమిలో అక్రమార్కులు బోరు వేసి, షెడ్డు ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడ్డారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గతంలో పనిచేసిన తహసీల్దార్ మతిన్ ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాప్రా జమ్మిగడ్డ ప్రాంతంలోని సర్వే నెం.199 బై 1 స్థలాన్ని స్టేడియానికి కేటాయించారు. ఆ స్థలంలో సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దర్జాగా బోరు వేసి, షెడ్డు వేయగా అప్పటి తహసీల్దార్ ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదని, నూతన ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలను కాపాడుకుంటామని, ఈ విషయంపై శుక్రవారం సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది.

నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూప్స్ కళాశాలలో స్ట్రీట్ కాజ్, ఎన్‌హెచ్‌ఆర్‌డీఎన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్డీఎన్ అధ్యక్షుడు బీవీఆర్ మోహన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి ఆనంద్ ఖోట్, సెక్రటరీ జనరల్ ధనుంజయ్ సింగ్, హైదరాబాద్ ప్రెసిడెంట్ విపుల్ సింగ్, టీ హబ్ సీఈఓ శ్రీనివాస్‌రావు, స్ట్రీట్ కాజ్ సీఈఓ శృతి చంద్ర, సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభినవ్‌రెడ్డి, ఇన్వెస్కో గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ హెడ్ సుమిత్ర త్యాగరాజన్, ట్యూటోరియల్స్ పాయింట్ డైరెక్టర్ పునీత్ గోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఆర్‌డీ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో 40 దేశాల్లో 18 వేల మంది సభ్యులతో సేవలు అందిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే తమ ముఖ్య లక్ష్యమన్నారు. అనంతరం సదస్సులో డిజిటల్ సంసిద్ధత, వ్యక్తిగత బ్రాడింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, నాయకత్వ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో పలు కళాశాలలకు చెందిన 1700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ రాపిడో వైస్ ప్రెసిడెంట్ అన్విత్, సీఎంఆర్‌ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి, స్ట్రీట్ కాజ్ సీఓఓ అక్షిత్, హ్యూమన్ క్యాపిటల్ డెలాయిట్ డైరెక్టర్ అగ్నివేష్ ఠాకూర్, సీహెచ్‌ఆర్వో అమిత్ సాహూ, మేఘన, స్ట్రీట్ కాజ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ



ఘట్‌కేసర్: 'నా ఓటు దేశం కోసమే' అంటూ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్ల దత్తత గ్రామం అవుషాపూర్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఓటు విలువను తెలియజేసే నాటిక ప్రదర్శించారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు సుస్మిత, ప్రియాంక, 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో 'సోలార్' పథకం రిజిస్ట్రేషన్లు

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సోలార్ రూఫ్ టాప్ పథకం కోసం జిల్లాలోని అన్ని పోస్టు ఆఫీసుల్లో రిజిస్టర్ చేసుకోవచ్చని జిల్లా పోస్టల్ అధికారి జి.సంపత్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సూర్య ఘర్ బిజిలీ ముఫ్త్ పథకం కోసం పోస్టు ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్‌తో పాటు దరఖాస్తు కూడా చేసుకోచ్చని, మరిన్ని వివరాల కోసం సమీప పోస్టల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చయన్నారు.

కళాశాలల నిర్మాణానికి చర్యలు: కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: కూకట్‌పల్లి, మల్కాజిగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల భవన నిర్మాణానికి స్థలం గుర్తించడంతో పాటు త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మౌలిక వసతుల కల్పన, నిర్వహణపై డిస్ట్రిక్ట్ కాలేజ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ అండ్ రివ్యూ కమిటీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరిలో ఒకే భవనంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్వహిస్తున్నామని, దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కాలేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఐఓఈ కిషన్, కళాశాలల ప్రిన్సిపాల్స్ అలివేలు మంగమ్మ, శైలజ, సునీత, సుమలత, కళాశాలల కోఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన మేయర్ కావ్య



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డిని మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, సంగీత రాజశేఖర్ రెడ్డి, మెట్టు ఆశాకుమారి, సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన విభాగ అధ్యక్షుడు భార్గవ్‌రామ్, నాయకులు మెట్టు వెంకన్న, సుధాకర్‌చారి, మహేశ్, ఎల్లస్వామి, సాధిక్ పాల్గొన్నారు.

డబిల్‌పూర్‌లో రెండు చోరీలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వైన్స్ షాప్, ఎలక్ట్రికల్ దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలోని తిరుమల వైన్స్, లక్ష్మి వెంకటేశ్వర హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. వైన్స్ షాప్‌లోని రూ.10 వేల నగదుతో పాటు ఆరు మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. మరోవైపు ఎలక్ట్రికల్ దుకాణంలో రూ.80 విలువ చేసే సామగ్రి చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు, డీఐ వెంకట్‌రెడ్డి సంఘటన స్థలికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

కనులపండువగా ప్రతిష్ఠోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న నవీన్ మిట్టల్ దంపతులు, ఆలయ చైర్మన్ దంపతులు

కీసర: శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం కనుల పండువగా ముగిశాయి. చివరిరోజు 36 మంది వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. మహా పూర్ణాహుతి, త్రిశూలస్నానం, శివలింగ ప్రతిష్ఠ అనంతరం స్వామివారికి ఐదు నదీ జలాలతో కుంభాభిషేకం, పంచామృతాలు, పండ్ల రసాలతో మొదటి అభిషేకం చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ల్యాండ్, రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు హాజరయ్యారు. పూజల అనంతరం నవీన్ మిట్టల్ దంపతులకు ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ మహాప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలలో చివరిగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళలకు కుట్టు మిషన్ల అందజేత



మహిళలకు కుట్టు మిషన్ల అందజేస్తున్న కౌన్సిలర్ సరిత తదితరులు

కీసర: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోగుల సరిత వెంకటేశ్ సూచించారు. జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు శిక్షణ పొందిన 90 మంది మహిళలకు శుక్రవారం కార్మికశాఖ అధికారులతో కలిసి ఆమె కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా భవానీనగర్‌లోని జరిగిన సమావేశంలో కౌన్సిలర్ సరిత మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి అంజి, సూపర్‌వైజర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆధీనంలోకి నర్సరీ

సాక్షి ఎఫెక్ట్..



నర్సరీ బోర్డు తిరిగి ఏర్పాటు చేయిస్తున్న కమిషనర్, చైర్ పర్సన్

ఘట్‌కేసర్: సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'భూమి గాయబ్' కథనానికి ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, చైర్ పర్సన్ పావనీ జంగయ్య స్పందించారు. పట్టణ నర్సరీబోర్డును పాత స్థలంలో ఏర్పాటు చేయడంతో పాటు నర్సరీ గేటుపై ఉన్న మాధవరెడ్డి పేరు, ఫోన్ నంబర్ తొలగించారు. పట్టణ నర్సరీ స్థలం సీలింగ్ ల్యాండ్‌గా తేలిందని, కబ్జాదారుడడిపై ఫిర్యాదు చేస్తామని కమిషనర్ తెలిపారు. కాగా, మున్సిపల్ నిధులు రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన నర్సరీని కబ్జా చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

సీలింగ్ భూమిని కాపాడాలని వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని సర్వేనంబర్ 127/బీలోని 1.39 ఎకరాల సీలింగ్ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్‌కు చెందిన ఎర్ర మైసయ్య శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 1978లో ప్రభుత్వం ఇచ్చిన సీలింగ్ భూమి ద్వారా జీవనోపాధి పొందామని, అనారోగ్యం కారణంగా పదేళ్లుగా భూమి పడావుగా ఉందని లేఖలో తెలిపారు. 2004లో హరికిషన్ మలానీ అనే వ్యక్తి 43 ఎకరాల్లో వెంచర్ చేసి, సీలింగ్ భూమిని డిలీటెడ్ ల్యాండ్‌గా చూపించారని చెప్పారు. అనంతరం 2020లో మున్సిపాలిటీ అధికారులు నర్సరీ ఏర్పాటు చేయగా.. ఇటీవల ఘట్‌కేసర్‌కు చెందిన కందకట్ల మాధవరెడ్డి అనే వ్యక్తి నర్సరీని ఆక్రమించాడని చెప్పారు. సదరు వ్యక్తి నాలా కన్వర్షన్ దరఖాస్తును పరిశీలించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ బ్లాస్టింగ్‌పై చర్యలు



బ్లాస్టింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ అశోక్‌కుమార్

కీసర: ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తే చర్యలు తప్పవని కీసర తహశీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం అంకిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 886, 887లోని ప్రభుత్వ స్థలాల్లో కొందరు నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేపడుతున్నారు. దీనిపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా స్థలాలను తహశీల్దార్ పరిశీలించారు. బ్లాస్టింగ్ చేపడుతున్న కంప్రెషర్ వాహనాన్ని సీజ్ చేశారు. అంకిరెడ్డిపల్లి రెవెన్యూకు ఆనుకొని యాదాద్రి భువనగిరి జిల్లా రామలింగంపల్లి ఉండటంతో బార్డర్ సమస్య ఉందని.. దీనిపై రెండు జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు గతంలోనే సర్వే రిపోర్టులు అందించినట్టు తహశీల్దార్ చెప్పారు. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు.

అభివృద్ధికే ఆమోదం

మూడు మున్సిపాలిటీలకు బడ్జెట్ కేటాయింపులు



దమ్మాయిగూడ కౌన్సిల్ సమావేశం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం కార్యాలయంలో శుక్రవారం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.20.96 కోట్ల అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. సిబ్బంది వేతనాలు, కార్యాలయ నిర్వహణ, శానిటేషన్, వీధి దీపాలు, మంచి నీటి వసతి తదితర పనులకు అయ్యే ఖర్చులకు ఆమోదం లభించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు వీణ, బాలరాజు, హేమంత్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, హంసరాణి, కోఆప్షన్ సభ్యులు జయశ్రీ, దేవేందర్‌రెడ్డి, షహానాబేగం, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సమావేశానికి ఏడుగురు దుమ్మా..

బడ్జెట్ సమావేశానికి బీఆర్‌ఎస్ రెబల్ కౌన్సిలర్లు ఐదుగురు, బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన ఒక్కో కౌన్సిలర్ గైర్హాజరయ్యారు. సుతారిగూడ, బాసిరేగడి, జ్ఞానాపూర్, అర్కల్‌గూడకు చెందిన కౌన్సిలర్లు సమావేశానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే యోచనలో రెబల్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఉన్నట్టు ప్రచారం ఉండగా.. సమావేశానికి వారంతా దూరంగా ఉన్నారు.

'దమ్మాయిగూడ' మున్సిపాలిటీ..

కీసర: దమ్మాయిగూడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సుమారు రూ 5.4 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించామన్నారు. స్టేషనరీ కొనుగోలుకు మరో రూ.5 లక్షలు, బ్లూక్రాస్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ద్వారా మున్సిపల్ పరిధిలోని వీధి కుక్కల సంరక్షణార్థం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.25 లక్షలు, పారిశుద్ధ్య సిబ్బంది కోసం రూ.4,56,100.. ట్రాక్టర్లు, ఆటోల రిపేర్ల కోసం రూ.4 లక్షలు, హరితహారం మొక్కల పెంపకం కోసం రూ.20 లక్షలు వెచ్చించేందుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఎమ్.నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, టీపీఓ శ్రీధర్ ప్రసాద్, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోచారం బడ్జెట్ రూ.22.42 కోట్లు

పోచారం: పోచారం పురపాలక సంఘం 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.22.42 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. పారిశుద్ధ్య వాహనాల నిర్వహణపై పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేశ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, బెజ్జంకి హరిప్రసాదరావు, సుర్వి రవీందర్, మోటుపల్లి పోచమ్మ, అబ్బవతిని సరిత, బద్దం మమతారాణి, కోఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, అక్రమ్ అలీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'ధరణి' దిద్దుబాటుకు చర్యలు



పెండింగ్ దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

శామీర్‌పేట్: ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్ర రెడ్డి అన్నారు. ధరణి సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం శామీర్‌పేట్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి, ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన బృందాల పనితీరుపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1వ తేదీ నుంచి 9 వరకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో పెండింగ్ దరఖాస్తులు, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యాదగిరిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.